అలజడి

కిటికీ బాగా ఎత్తుగా ఉండటం వల్ల అతనికి కనిపించడం లేదుగానీ, ఆకాశం ఘోరమైన రణరంగంలా ఉంది. మబ్బులు గుమిగూడి గర్జిస్తున్నాయి. సన్నగా జల్లు పడుతున్నది. మరి కాస్సేపటిలో కుంభవృష్టి తప్పదనిపిస్తున్నది. జలార్ద్రమైన నల్లని మబ్బుల వెనుక గొప్ప కోలాహలం, అలజడి...

బయట బరువైన బూట్ల సవ్వడి....

మోకాళ్ల చుట్టూ చేతులు కట్టుకుని కూర్చున్న గాంధీ తల ఎత్తి చూశాడు. కటకటాల అవతల వరండాలో నిలబడి బీడీ కాల్చుకుంటున్నాడు అప్పలస్వామి. రెండు దమ్ములు పీల్చి, వరండా క్రిందికి ఉమ్మివేసి, వెనుదిరిగి కటకటాల దగ్గరగా వచ్చి నవ్వుతూ "ఏం బాబూ! నిద్ర పట్టలేదా?" అని అడిగాడు గాంధీని.

గాంధీ తల అడ్డంగా ఊపాడు. అప్పలస్వామి మళ్లీ ఏదో మాటాడబోయి అంతలోనే విరమించుకుని నెమ్మదిగా నడిచి వెళ్లిపోయాడు. అతని బూట్ల సవ్వడి ఆ వరండాలో క్రమంగా దూరమైపోయింది.

గాంధీ ఉన్నట్టుండి లేచి కళ్లజోడు తీసి తుడుచుకుని, ఆ చిన్న గదిలో పచార్లు చేయడం ప్రారంభించాడు.

బయట వర్షం కొంచెం పెద్దదయింది. బుల్లి పిట్ట ఒకటి - దాని రంగు ఏదో సరిగా తెలియడం లేదు. అంత రాత్రివేళ ఎందుకు వచ్చిందో మరి. కిటికీలో నిలబడి సన్నగా అరుస్తున్నది. అది బహుశా పూర్తిగా తడిసిపోయి ఉండాలి. గాంధీ ఆగి చూశాడు. ఒక నిముషం గడిచి ఉంటుంది. ఆ పిట్ట, పాపం లోపలికి వస్తే బాగుండుననిపించింది. కానీ, అది రాలేదు. కొద్ది క్షణాల్లో చిన్నచిన్న రెక్కలు విదిలించుకున్న ధ్వని. ఆ వెనువెంటనే అది ఎగిరిపోయిన మృదువైన సవ్వడి... ఆ తర్వాత అంతా నిశ్శబ్దం...

కిటికీలో నుంచి ఆకాశం, కత్తిరించిన నల్లని కాగితం ముక్కలాగున్నది. కిటికీ అవతల ఏమున్నదో తెలియదు. బహుశా, అది అంతా ఖాళీ స్థలం కావచ్చు. ఆ పైన బలమైన కొండరాళ్లతో కట్టబడిన ఎత్తయిన ప్రహరీ గోడ ఉండే ఉంటుంది. ఆ ప్రహరీపైన గాజు పెంకులు దట్టంగా బిగించబడి ఉంటాయి.

ఎక్కడో గంటలు కొడుతున్నారు. గాంధీ ఆగి చెవులు రిక్కించి వింటూ, వ్రేళ్లు మడుస్తూ లెక్కపెట్టాడు. మొత్తం తొమ్మిది గంటలే వినిపించాయి. ఇప్పుడు తొమ్మిదేనా అయింది? కాదు... బహుశా గాలివాలు కారణంగానూ, వర్షపు జల్లు మూలంగానూ కొన్ని గంటలు తనకు వినబడి ఉండవు.

మళ్లీ అప్పలస్వామి వరండాలో నడిచివచ్చాడు. అతడు గాంధీ వంక ఆ సన్నని వెలుతురులో ఒకసారి చూసి కటకటాల మీద చేతితో మీటుతూ "ఇవాళ కోర్టులో ఏమయింది?" అని అడిగాడు.

గాంధీ చేతి వ్రేళ్లు విరుచుకుని చప్పరించి "ఏమీ కాలేదు..." అన్నాడు.

"అంటే విచారణ జరగలేదా?"

"జరిగింది..."

"అదే ఏం జరిగిందీ అని అడుగుతున్నాను!"

గాంధీ నుదురు తుడుచుకున్నాడు. ఒక్క క్షణం ఆగి నెమ్మదిగా "ఏమీ జరగలేదు. అన్నట్టు కాసిని కాయితాలూ, కలమూ కావాలని అడిగా కదా! ఎప్పుడిస్తారు?" అని అడిగాడు.

అప్పలస్వామి అనునయంగా చూశాడు. తర్వాత "అడిగాను... వీల్లేదన్నారు. అవి అంత అవసరమా?" అన్నాడు.

"అవసరమే... చాలా రాసుకోవాలి... ఎన్నో విషయాలు బుర్రను పాడుచేస్తున్నాయి. రాసుకునే వీలుంటే బాగుండిపోను. నా పుస్తకాలూ, నేను రాసుకున్న కాయితాలూ అన్నీ ఏంచేశారో ఎవ్వరూ చెప్పడం లేదు. అన్నీ నాకు ముఖ్యమైన సైన్సు పుస్తకాలు" అన్నాడు గాంధీ చాపమీద కూలబడుతూ.

అప్పలస్వామి "అవన్నీ నీకు ముఖ్యం... కాని, వాళ్లకు మాత్రం అవేమీ పట్టవు. ఒక్క కాయితమే వాళ్లకు ముఖ్యం... ఆ చిన్న చీటీ... ఉత్తరం..." అని ఒక్క క్షణం ఆగి పక్కకు చూస్తూ "ముసురు బాగా పట్టింది. ఇప్పట్లో తగ్గేట్టు లేదు..." అన్నాడు.

తర్వాత మళ్లీ "ఉత్తరంలో ఏం రాశావు?" అని అడిగాడు.

గాంధీ మాట్లాడలేదు. అతని కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి. మనసులో ఏదో అజ్ఞాత కంఠం దిగులుగా గుసగుసలాడుతున్నట్టున్నది.

"గాంధీ అనబడే నేను.... ఎం.ఎస్‌సి... న్యూక్లియర్ ఫిజిక్స్... యూనివర్సిటీ మొత్తంమీద సెకండ్... నిరాశా నిస్పృహలతో జీవితంలో ఓడిపోయి... నిరుద్యోగిగా బ్రతకలేక... జీవితాన్ని అంతం చేసుకుంటున్నాను. నాకు ఎవరూ లేరు... కావలసిన వారూ లేరు.. శత్రువులూ లేరు... నా చావుకెవరూ బాధ్యులు కారు... ఎవరినీ నిందించను... నా అంతట నేను స్వయంగా చచ్చిపోతున్నాను." (అవును, ఈ వాక్యం కూడా వ్రాశాడు. అయినా ఇదేం వాక్యం?)

గాంధీ ఏమీ మాట్లాడకుండా నిశ్శబ్దంగా కూర్చుండి పోయేసరికి అప్పలస్వామి ఒకసారి నిట్టూర్చి మళ్లా వరండాలో నడుచుకుంటూ వెళ్లిపోయాడు.

గాంధీ చాపమీదికి వొరిగి గోడకానుకొని కళ్లు మూసుకున్నాడు. అంతేనా తాను ఆనాడు వ్రాసింది? బహుశా అంతే... కాకపోతే ఇంకా నాలుగైదు అర్థరహితమైన వాక్యాలు వ్రాశాడేమో గుర్తులేదు... అప్పుడు తన మనసంతా ఇప్పటి ఆకాశంలాగే ఘోరంగా, అస్తవ్యస్తంగా, అరణ్యంలా ఉంది. భయంకరంగా కూడా ఉంది.

గాంధీ మళ్లీ కళ్లజోడు తీసి మాసిన లాల్చీ చివరతో అద్దాలు తుడుచుకుని మళ్లీ మొహానికి తగిలించుకున్నాడు. తల తిప్పి గోడవంక చూస్తూ కూర్చున్నాడు. అకస్మాత్తుగా ఆ గుడ్డి వెలుతురులో అతనికి ఆ గోడమీద పెన్సిలు గీతలు కనిపించాయి. కళ్లు చిట్లించి జాగ్రత్తగా చూశాడు. ఎవరు, ఎప్పుడు గీశారో మరి.

ఒక సున్నా... అది తల... రెండు గీతలు.. అవి చేతులు... తొడలు మాత్రం లావుగా గీశారు. వక్షస్థలాన్ని సూచిస్తూ మళ్లీ రెండు పెద్ద సున్నాలు... అవి అసహజంగా, పెద్దవిగా ఉన్నాయి. అంతే.. ఇంకేమీ లేదు.

అతడు అప్రయత్నంగా నిట్టూర్చి మోకాళ్ల మధ్య తలపెట్టుకుని కూర్చున్నాడు. అతనికి హఠాత్తుగా తల్లి గుర్తుకు వచ్చింది. పదేళ్ల క్రిందట... అవును. సరిగ్గా పదేళ్లు... ఆమె చనిపోయే ముందు ఎలా ఉండేదో గుర్తుచేసుకునే ప్రయత్నం చేశాడు. అప్పటికి ఆమెకు బహుశా నలభై ఏళ్లుంటాయేమో! దుఃఖభారం వల్ల, పేదరికం వల్ల, మనిషి జవసత్వాలు కోల్పోయి చాలా ముందుగానే వృద్ధురాలై పోయింది. అకాల వార్ధక్యం ఆమెను లొంగదీసుకుని అశక్తురాలిని చేసింది. ఒకనాడు... తాను బడిలో ఉండగా... మధ్యాహ్నం సూర్యుడు నిప్పులు చెరిగేవేళ... అట్టే బాధపడకుండానే చనిపోయింది. అది మొదటిసారి అతడు శవాన్ని చూడటం... తండ్రిని ఎరుగడు.... తాను తల్లి కడుపులో ఉండగానే తండ్రి పోయాడు. వారూ, వీరూ చెప్పుకోడం మాత్రం గుర్తు... ఆయనను గురించి అందరూ జాలిగా, సానుభూతిగా మాత్రమే అనుకుంటూ ఉండేవారు. ఒక్క రుణదాత తప్ప... అదీ అయిదువందల రూపాయలే... తన తల్లి తర్వాత రెండేళ్లకుగానీ ఆ అప్పు తీర్చలేకపోయింది. ఎవరో ఒక ముసలాయన తన తండ్రిని గురించి మాట్లాడటం అతనికి బాగా గుర్తున్నది. "పాపం మంచివాడు. కలియుగంలో ఉండవలసిన మనిషి కాదు. 'సొతంత్రం... సొతంత్రం...' అంటూ ఉన్నదంతా కరిగించుకుని, జైళ్లకు పోయి, లాఠీ దెబ్బలు తిని, నానా బాధలూ పడ్డాడు. ఏం మిగిలింది? ఏం సాధించాడు? ఏమీ లేదు. పైగా మిమ్మల్ని దిక్కులేని పక్షుల్ని చేశాడు". బహుశా అప్పుడు అమ్మ అక్కడ కళ్లనీళ్లు పెట్టుకుని నిలబడి ఉంది. తానూ అప్పుడు అక్కడే ఉన్నాడు. పోనీ, చూద్దామంటే తండ్రి ఫోటో కూడా ఏదీ మంచిది లేదు. ఒక పాత గ్రూప్ ఫోటో– ఆయన కాలేజీలో చదువుకుంటుండగా తీయించుకున్నది – ఉన్నది కాని, అందులో మొత్తం నలభై మంది పైగా ఉన్నారు. ఫోటో పట్టనట్టు కిటకిటలాడుతున్న అంతమందిలోనూ, "ఇరుగో, వీరే మీ నాన్న..." అని ఒకసారి తల్లి చూపించింది. కాని, ఆ బొమ్మ చాలా చిన్నది. తల తప్ప ఏమీ కనిపించడం లేదు. ఆ కళ్లు మాత్రం చెంపకు చేరెడేసి

ఉన్నాయి. భవిష్యత్తులోకి ఆశగా, అద్భుతంగా చూస్తున్నట్టు ఉన్నాయవి. తనవీ అచ్చం అవే కళ్లని అమ్మ ఎన్నోసార్లు అన్నది.

గాంధీకి అంతలో అనవసరంగా నవ్వు వచ్చింది. తాను కడుపులో ఉండగా తన తండ్రి స్వాతంత్ర్యోద్యమంలో ముమ్మరంగా, నిర్విరామంగా తిరిగాడు. తనకు కూతురు పుడితే 'స్వరాజ్యలక్ష్మి' అనీ; కొడుకు పుడితే 'మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ' అని పేరు పెట్టాలన్నాడు. పెద్దల పేర్లూ, దేవుళ్ల పేర్లూ అసలు వొద్దుపొమ్మన్నాడు. ఇన్నీ అని, తాను పుట్టకముందే పోయాడు.

బయట రణగొణ ధ్వని. కాటుక కొండలవంటి మేఘాల చాటున ఫిరంగులు మ్రోగుతున్నట్టున్నది. ఉరుములు... మెరుపులు...

ఎనిమిది, తొమ్మిది నెలల క్రిందట... తాను అప్పటికే కనిపించిన ప్రకటనలన్నిటికీ అప్లయి చేసి వున్నాడు. మొదటిసారి ఒక చిన్న, కొత్త కాలేజీకి ఇంటర్వ్యూకు వెళ్లిన ఉదంతం గుర్తుకు వచ్చింది. ఆలస్యంగా వచ్చిన రైల్లో ఆ వూళ్లో దిగేసరికి వర్షం... సన్నగా ప్రారంభమై అంతలోనే పెద్దదయింది. కాస్సేపు స్టేషన్లో తలదాచుకుని తర్వాత ఊళ్లో వారినీ, వీరినీ అడుగుతూ చివరకు పొలాల గట్లవెంట నడిచి కాలేజీకి పోయాడు. బురదలో నడుస్తూ ఉండగా తాను అనుమానిస్తున్నట్టే చెప్పు తెగింది. శుభ్రంగా తడిసి ముద్దయిపోయి ఉన్నాడు. చేతిలో సర్టిఫికెట్లు, టెస్టిమోనియల్సుతో నిండిన సంచీ, తెగిన చెప్పు, చప్పగా తడిసి, నిలువెల్లా నీళ్లు కారుతూ తాను కాలేజీకి చేరుకున్నాడు. కాలేజీ అంటే చుట్టు తాటాకుల పాకలు... వాటిలో రొదచేస్తూ విద్యార్థులు... మధ్యలో కొంచెం దిట్టమయిన కట్టడం... తాను అక్కడికి చేరుకున్న కొద్ది క్షణాల్లోనే విద్యార్థులందరూ "పాకలు కురుస్తున్నాయి... సెలవు కావాలి..." అని ప్రిన్సిపాలు గదిముందు వర్షంలో నిలబడి నినాదాలు చేసి, అయిదు నిముషాల్లో సెలవు సంపాదించుకుని ఎటువారటు పోయారు. అంతా సద్దుమణిగిన తర్వాత తాను ప్రిన్సిపాల్‌ను కలుసుకుంటే ఆయన చప్పరించి "ఆలస్యమైపోయింది... అప్పాయింట్‌మెంట్ జరిగిపోయింది.." అన్నాడు. తర్వాత తెలిసింది... అది ముందే నిశ్చయమైపోయిన విషయం. కాకపోతే ఇంటర్వ్యూ అనేది ఒక తప్పనిసరి ప్రహసనం... కేవలం తమాషా... అంతే...

గాంధీ అనవసరంగా దగ్గి చాపమీదికి జారి పడుకున్నాడు. కళ్లు మూసుకున్నా నిద్ర పట్టడం లేదు. మళ్లీ రేపు కోర్టుకు తీసుకుపోతారు. ఇవాళ ఎక్కువ ఏమీ జరగలేదు. రేపు ప్రశ్నల వర్షం కురిపిస్తారు. ఉక్కిరిబిక్కిరి చేస్తారు.

ఆ తర్వాత చాలా రోజులు ఏ ఉద్యోగమూ రాలేదు. కనీసం ఇంటర్వ్యూ పిలుపులైనా రాలేదు. తన పని మామూలే. నెలకు ఆరు రూపాయలకు అద్దెకు తీసుకున్న చిన్న గదీ (దానికి రెండు నెలల అద్దె బకాయి), గదిలో చాప, పక్కన పాత ట్రంకుపెట్టె, పైనా క్రిందా పుస్తకాలు, పెచ్చులూడిపోయిన గోడకు ఒక పిల్లి బొమ్మ ఉన్న క్యాలెండరూ, ఒక ఐన్‌స్టయిన్ ఫొటో, గ్లాసు, అద్దం... ఇదీ తన సంపద. వారానికి అయిదు రోజులే తిండి... రోజుకో ఇంటి చొప్పున

అయిదు ఇళ్లే మిగిలాయి అప్పటికి. సోమవారం, శుక్రవారం తనకు తిండిపెట్టే మంచివాళ్లకు ట్రాన్స్ఫరయి ఎటో వెళ్లిపోయారు. రోజూ సాయంకాలం పూట అయిదారుగురు పిల్లలకు ట్యూషన్ చెప్పడం, మిగిలిన కాలమంతా, 'కావలెను' ప్రకటనలు చూస్తూ ప్రతిచోటకీ అప్లయి చేయడం, చదువుతూ, వ్రాస్తూ గడపడం, ఏమీ తోచనప్పుడు ఐన్‌స్టయిన్ ఫోటో చేతిలోకి తీసుకుని ఊరికే చూస్తూ కూర్చోడం, ఇంతే... ఆ రోజుల్లో అతడు సాధించిన ఘనకార్యం ఒక్కటే. ప్రక్క యిళ్లలో పనిచేసే పదేళ్ల రంగడనే అనాథ బాలుడికి చదవడం, వ్రాయడం నేర్పాడు. ఉద్యోగం దిగులెక్కువై పోయింది. ఎక్కడికి పోయినా "లేదు" అనే మాట తప్ప మరోటి వినబడలేదు. కొన్ని చోట్ల–

"మాకు న్యూక్లియర్ ఫిజిక్స్ పనికిరాదు బాబూ! మామూలు ఫిజిక్స్ అయితే ఏదో చూసేవాళ్లం. అయినా రీసెర్చికి పోకపోయావా? స్కాలర్‌షిప్ వచ్చేదిగా?"

"అవకాశం రాలేదండీ... ప్రయత్నించాను"

"ప్చ్! లాభం లేదు."

మరికొన్ని చోట్ల–

"ఇంత క్వాలిఫికేషన్ మాకెందుకు నాయనా! ఏదో మామూలు స్కూలు..."

ఇతర చోట్ల–

"మాకు మామూలు అక్కౌంట్స్ తెలిసిన గుమాస్తా కావాలి. ఈ సైన్సులెందుకు?"

"పోనీ... అదే చేస్తానండీ..."

"కుదరదు... నువ్వు చెయ్యలేవు..."

చదువుకున్నన్నాళ్లూ తాను వారాలు చేసుకుని లోకులమీద ఆధారపడ్డాడు. ట్యూషన్ల మీద పెద్దగా వచ్చిందేమున్నది? పై ఖర్చులు మాత్రం వెళ్లిపోయేవి. చదువైపోయింది. డిగ్రీ చేతికొచ్చింది. విన్నవారూ, చూసినవారూ ఏమనుకుంటారో అనిపించేది. ఎవరింటికయినా పొద్దున్నే వెళ్లి, "ఇవాళ మీ ఇంట్లో వారం!" అని చెప్పి రావడానికి, తిండికి వెళ్లడానికీ సిగ్గుతో క్రుంగిపోయేవాడు.

గాంధీ చలికి ముడుచుకుని పడుకున్నాడు, తల్లి కడుపులో ఉన్న పిల్లవాడిలాగున. అతని తల్లి అంటూ ఉండేది. మా వాడు నిద్రలో కదలడు. పుస్తకంలాగు పడుకుంటాడు అని. అతనికి మాగన్నుగా నిద్ర పడుతున్నది. కాని, అది సరయిన నిద్రకాదు. కళ్లముందు ఏవేవో చిత్రాలు... దృశ్యాలు.

అతడు గురువారం నాడు భోజనం చేసే ఇల్లు... ఆయన ఒక మెడికల్ రెప్రజెంటేటివ్... చాలా మంచివాడు... బ్రహ్మచారి... వయసులో ఉన్న వితంతువైన చెల్లెలు. ఆమెకు ఒక పసిపిల్ల... వరండా ప్రక్కన గదిలో వయసు మళ్లిన ముసలి తండ్రి... ఆనాడు రాత్రి తొమ్మిది గంటలవేళ గాంధీ భోజనానికి వెళ్లాడు. ముసలాయన గదిలో అలికిడి లేదు. బహుశా నిద్రపోతున్నాడేమో, లేకపోతే ఊళ్లో లేడో!... మూడేళ్ల పిల్ల హాల్లో సోఫాలో పడుకుని నిద్రపోతున్నది. సోఫా క్రింద

నేలమీద ఒక చెయ్యి విరిగిన బొమ్మ.... గోడమీద "టిక్కు టిక్కు"మంటున్న గోడ గడియారం...చుట్టూ నిశ్శబ్దం... తలుపు తట్టిన శబ్దం విని ఆమె వచ్చింది. "నీ కోసమే చూస్తున్నా"నంటూ లోపలికి తీసుకువెళ్లి అన్నం పెట్టింది. ఆ తర్వాత అతడు హాల్లోకి వచ్చాడు. ఆమె వెనుకనుంచి "ఇప్పుడంత దూరం వెళ్లడం దేనికి? ఇక్కడే పడుకో... నాకూ భయంగా వుంది. ఒంటరిగా ఉన్నాను" అన్నది. అతడు హాల్లోనే సోఫాలో ఒక పక్కన కూలబడ్డాడు. అంతలోనే నిద్ర ముంచుకువచ్చింది. ఎంతసేపు నిద్రపోయాడో ఏమో! ఆమె అతని మీదికి వంగి లేపుతూ ఉండగా మెలకువ వచ్చింది. ఆమె మెడలోని ఒంటిపేట బంగారు గొలుసు అతని నుదుటికి చల్లగా తగులుతున్నది. ఆమె "లే... లేచి లోపల పడుకో..." అంటూ పక్క గదిలోకి వెళ్లింది. అతడు లేచాడు. చేతివ్రేళ్లు విరుచుకుని, నుదురు గట్టిగా తుడుచుకుని ఒక్క క్షణం నిలబడి అంతలోనే తలుపు తీసుకుని వరండా దాటి మెట్లు దిగి వీధి తలుపు విసురుగా తోసి వీధిలోకి వచ్చాడు. విసవిస నడవడం ప్రారంభించాడు. ఆమె వెనకనుంచి "అదేమిటి? వెళ్లిపోతున్నావా?" అనడం వినిపించింది. కానీ, అతడు ఆగలేదు. వెనుదిరిగి చూడనైనా లేదు. వెలుగు చీకట్లతో నిండిన వీధిలో గబగబ నడచిపోయాడు.

గాంధీ పక్కకు ఒత్తిగిలి పడుకున్నాడు. అంతలో అతనికి ఎప్పుడో తాను చూసిన కడుపుతో ఉన్న పెద్ద బల్లి గుర్తుకు వచ్చింది. ఆ వెనువెంటనే వందలాది కాళ్లతో అసహ్యంగా నడిచే కాళ్లజెర్రి గుర్తుకు వచ్చింది. "దానికి అన్ని కాళ్లెందుకో?" అనిపించింది. ఎక్కడి నుంచో మృదువైన వాసన... జైల్లో ఈ వాసన ఏమిటి? ఆనాడు తాను సీసాలో తెచ్చుకున్న పదార్థం వాసన ఇలా మృదువుగా లేదు... చాలా ఘాటుగా ఉంది.

ఆనాడు ఆగస్టు పదిహేనవ తేదీ... దేశమంతటా గొప్ప కోలాహలం... సంచలనం... హడావిడి... ప్రబోధాలు... హితోక్తులు... ప్రసంగాలు... ప్రదర్శనలు... పతాకాలు... అంతా సంతలాగు, సంబరంలాగున్నది. ఆ చిన్న రూములో పగలంతా ఒంటరిగా గాంధీ... రాత్రి పది గంటలు... చుట్టూ నిశ్శబ్దం... కిటికీలో లాంతరు మందంగా వెలుగుతున్నది... బహుశా ఆనాటితో అందులో కిరసనాయిలు అయిపోతుంది... ట్రంకు పెట్టెమీద ఫొటోలో ఐన్‌స్టయిన్ కళ్లు- నిశితమైన, చురుకైన కళ్లు, తీవ్రంగా చూస్తున్నాయి. గోడమీది క్యాలెండరులో పిల్లి- ఏ క్షణంలోనైనా యీలవేస్తే చాలు, లేచి రావచ్చునన్నంత సహజంగా ఉంటుంది- మూతి ముడుచుకుని వెలిగే కళ్లతో చూస్తున్నది. చాప ప్రక్కన మూలగా ఆ చిన్న సీసా. అతడు లావాటి పుస్తకం తీశాడు. దానిలో పేపర్ కటింగ్స్ చాలా ఉన్నాయి. హాల్డేన్, నర్లేకర్, ఖొరానాల ప్రసంగాలు, బొమ్మలు, ఇంకేవేవో వైజ్ఞానిక వ్యాసాలు. బాబా ఫొటో ఒకటి. చంద్రమండలం మీద మానవుడు పాదం పెడుతున్న రంగుల దృశ్యం; తన క్లాస్‌మేట్ ఒక అమ్మాయి (ఆమెనతడు ప్రేమించాడా?) ఎన్నడో పంపిన గ్రీటింగ్ కార్డు వెనక వెన్నెలలో తాజ్‌మహల్ సుందర దృశ్యం; తాను వ్రాసిన ఏవేవో వ్యాసాల కట్టలు; సైన్సులో నోబెల్ బహుమతి పొందినవారి వివరాలు; ఒక యువ

సైంటిస్టు, నిరాశా నిస్పృహలతో ఆత్మహత్య చేసుకుంటూ వ్రాసిన విషాదకరమైన చివరి ఉత్తరం; ఇన్నింటినీ ఒక్కసారి తిరగవేశాడు. తర్వాత ఒక కాగితం చేతిలోకి తీసుకున్నాడు. కలంలో సిరా అయిపోయిందో ఏమో విదిలిస్తే కానీ వ్రాయలేదు. అప్పుడు తనకు మనస్థిమితం ఉన్నదా? ఉన్నదనే అనుకున్నాడు. కళ్లవెంట మాటిమాటికీ నీళ్లు ఉబుకుతున్నాయి. వొణుకుతున్న చేత్తో కాసిని వాక్యాలు వ్రాశాడు. చివర సంతకం పెట్టబోతే సిరా అయిపోయిందేమో, పూర్తిగా వీలుపడలేదు. చివరి అక్షరం తేలిపోయింది. తేదీ వెయ్యలేదు. ఆ తర్వాత చాలాసేపు కదలకుండా కూర్చుని వొణుకుతున్న చేతులతో ఆ సీసా తీసుకుని దానివంక కాస్సేపు కన్నార్పకుండా చూశాడు. మనసంతా మొద్దుబారి పోయింది. ఏ అనుభూతీ, ఆలోచనా లేని అవస్థ... గ్లాని... చేతులు వొణుకుతున్నా పని పూర్తిచేసుకున్నాడు. తర్వాత చాపమీద వెల్లకిలా పడుకున్నాడు. కొద్ది క్షణాలే... బహుశా నిముషం కూడా అయి ఉండదు. మెదడులో ముందు, కేవలం ఎర్ర తామరపూలతో నిండిన చెరువు... తర్వాత అంకెలూ, అక్షరాలూ, ఏవేవో ఈక్వేషన్‌లూ తిరిగిపోయాయి... ఏదో అజ్ఞాత లోకంలోకి వేగంగా ప్రయాణం చేస్తున్న అనుభూతి... తర్వాత భారరహిత స్థితి... రెక్కలు వచ్చి మబ్బులు దాటి కాంతివేగంతో వెళ్లిపోతున్నట్టు... "అన్నట్టు కాంతి వేగం సరిగ్గా ఎంతో" అన్న భావన... సరిగ్గా ఆ క్షణంలో రంగడు మెరుపులాగా వచ్చాడు. ఎందుకు వచ్చాడో తెలియదు. ఆగస్టు పదిహేను హడావిడి అంతా వాడి మొహంలోనే ఉన్నట్టున్నది. గుండెమీద చిన్న జెండా పెట్టుకుని ఉన్నాడు. వాడు గాంధీని పిలిచి, అతడు బదులు పలక్కపోయేసరికి పెద్దగా అరిచి కేకలు పెట్టాడు. అంతలో హడావిడిగా అందరూ వచ్చారు. గుంపుగా వచ్చారు. తర్వాత అతన్ని అపస్మారక స్థితిలో ఆస్పత్రికి తీసుకుపోయారు. అక్కడ డాక్టర్లు అతని పొట్టలోని విదేశీ పదార్థాన్ని విజయవంతంగా ఇవతలికి తీసి అతన్ని బ్రతికించారు. తర్వాత రెండుమూడు రోజులే ఆస్పత్రిలో ఉంచారు. ఈ మధ్యలో పోలీసులు హడావిడి చేశారు. అతని రూము అంతా గాలించారు. అవసరమైనవీ, అనవసరమైనవీ అన్నీ తీసుకున్నారు. "ఆస్పత్రిలో ఇక ఉండనక్కర లేదు... వెళ్లిపొ"మ్మని డాక్టర్లు సాగనంపేసరికి సిద్ధంగా ఉన్నారు పోలీసులు...

కోర్టులో విచారణ.. కొండరాళ్లతో కట్టబడిన పాతకాలపు కట్టడం... విశాలమైన హాలు... ఎదురుగా జడ్జి... నల్లకోట్లు ధరించిన న్యాయవాదులు... తలలకు పాగాలతో వరండాలలోనూ, లోపలా ప్లీడరు గుమాస్తాలు, బిళ్ల బంట్రోతులు... జడ్జిగారి పైన గోడమీద పెద్దసైజు జాతిపిత, ప్రధాని, రాష్ట్రపతుల రంగుల ఫొటోలు...

న్యాయమూర్తి నడివయసు వాడే... మూర్తీభవించిన మంచితనంలా ఉన్నాడు. అవసరం వస్తే కరుడుగట్టిన కాఠిన్యంలాగానూ ఉండగలవాడిలా కనిపిస్తాడు. గాంధీని మధ్యాహ్నం వేళకు లోపలికి తీసుకుపోయి బోనెక్కించారు. ఒక న్యాయవాది... దళసరి కళ్లద్దాలు ధరించినవాడు- విషయం అంతా పెద్ద గొంతుతో నివేదించాడు. న్యాయమూర్తి ప్రసన్నంగా గాంధీ వంక చూస్తూ బుగ్గన చెయ్యి ఆనించుకుని విన్నాడు. కొందరు న్యాయవాదులు కూడా ఉత్కంఠతో విన్నారు.

పోలీసులు గుమ్మం దగ్గర నిలబడి ఉన్నారు. వెనక బల్లలమీద కొందరు కూర్చున్నారు. వారు కూడా విన్నారు. గాంధీ అంతసేపూ నుదురు చేత్తో రుద్దుకుంటూనూ, లాల్చీ జేబుల్లో చేతులుంచి మళ్లా బయటికి తీస్తూనూ నిలబడిపోయాడు. అంతలో అతనిచేత "నిజమే చెబుతా"నని ప్రమాణం చేయించి ప్రశ్నలు ప్రారంభించారు. అతని రూములో పోలీసులు లోబరచుకున్న కాయితాలలో అతని స్కూల్ ఫైనల్ రిజిస్టరు మొదటి పేజీ కాపీ ఉంది.

పేరు – మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ, ముష్టి

పుట్టిన తేదీ – ఆగస్టు మొదటి తేదీ, పందొమ్మిది వందల నలభై ఏడు.

పుట్టుమచ్చలు – ఎడమ మోచేతిపైన పెద్ద పుట్టుమచ్చ ఒకటి, కుడి భుజాన పైన చిన్న పుట్టుమచ్చ మరొకటి.

నడవడి – సంతృప్తికరం.

గాంధీ నిశ్చలంగా వింటున్నాడు. అతనికి అంతలో ఎప్పుడో తాను నీళ్లలో చూసిన శవం గుర్తుకు వచ్చింది. అది నీళ్లలో నాని బాగా ఉబ్బిపోయి ఉంది. బోర్లా పడుకుని నీళ్లలో తేలుతూ లాకులదగ్గర ఆగిపోయింది. "అది తనకు ఎందుకు గుర్తు వచ్చిందా!" అని ఆలోచించాడు. ఆ ఆలోచన తెగలేదు. అంతలో అతన్ని పరధ్యానంగా ఉన్నందుకు మందలించి ప్రశ్నలు మొదలుపెట్టారు.

గాంధీ కంఠం వొణికుతుండగా చెప్పాడు.

"అవును. ఆత్మహత్య ఘోరమైన నేరమే" అతని కళ్లలో నీళ్లు నిలిచాయి.

"అయినా గత్యంతరం లేకపోయింది. అయిన వాళ్లెవరూ లేరు. చిన్నప్పటినుంచీ శ్రద్ధగా చదువుకున్నాను. ట్యూషన్లు చెప్పుకున్నాను. చదువైపోయిన తర్వాత రిసెర్చి స్కాలర్‌షిప్ వస్తుంది కదా అని ఆశపడ్డాను. కానీ, రాలేదు. ఎన్నో ఉద్యోగాలకు అప్లయి చేశాను..." అతడు ఆగి, వొణికుతున్న వ్రేళ్లతో కనుతుదలు తుడుచుకుని కళ్లజోడు పెట్టుకుని మళ్లీ అన్నాడు.

"ఏదీ రాలేదు. ఎంతకాలం ఇట్లా? ఇట్లా బతకలేననిపించింది. అంతే..."

జడ్జి కళ్లజోడు తీసి ఎదురుగా బల్లమీద పెట్టి నుదురు తుడుచుకుని కాస్సేపు కళ్లు మూసుకున్నాడు. కొద్ది క్షణాలు కోర్టు హాల్లో నిశ్శబ్దం వ్యాపించింది. జడ్జి అంతలో గడియారం చూసుకొని, కళ్లజోడు అందుకుని చివాలున లేచి లోపలికి వెళ్లిపోయాడు. విచారణ మరునాటికి వాయిదా వేశారు.

గాంధీకి నిద్ర పట్టింది. కానీ, కలవరిస్తూనే ఉన్నాడు. ఏవో అస్పష్టమైన మాటలు.

అప్పలస్వామి అర్ధరాత్రివేళ వచ్చి కటకటాల పక్కన నిలబడి బీడీ ముట్టించుకుని, ఆ అగ్గిపుల్ల వెలుతురులో లోపల నిద్రపోతున్న గాంధీ వంక చూసి తనలో తను నెమ్మదిగా నవ్వుకుని బీడీ దమ్ము పీలుస్తూ చాలాసేపు అక్కడే నిలబడ్డాడు. తర్వాత బూట్ల చప్పుడు కాకుండా నెమ్మదిగా నడిచి వెళ్లిపోయాడు.

గాంధీకి మెలకువ వచ్చేసరికి బాగా పొద్దెక్కింది. అతని కళ్లు ఎర్రగా జ్యోతుల్లా ఉన్నాయి. కణతల మీద నరాలు ఉబ్బి ఉన్నాయి. నిద్రలో వరసగా కలలు వచ్చాయి. ఒక కలలో అంకెలు... అన్నీ అంకెలే అల్లిబిల్లి తిరుగుతూ అద్భుతంగా కనిపించాయి. మరో కలలో లెక్కలేనన్ని పాములు... వందలూ వేలూ- తర్వాతి కలలో అసంఖ్యాకమైన సౌర కుటుంబాలూ, తారా సందోహాలూ, గ్రహాలూ, గ్రహ శకలాలూ, తోకచుక్కలూ, పరమాణు ప్రయోగాలూ కనిపించాయి.

అప్పలస్వామి తలుపు తీయగానే గాంధీ "ఏవీ కాయితాలు? కలం ఏదీ?" అని అడిగాడు. అప్పలస్వామి ఏమీ మాట్లాడలేదు.

గాంధీ కూడా మళ్లీ ఏమీ అడగలేదు. బయటికి వచ్చి చూస్తే పలుచని ఎండ మృదువుగా, మెత్తగా అతని మొహానికి తగిలింది. ఆవరణలో కాస్సేపు అటూఇటూ తిరిగి కాపలావాడిని పిలిచి, ఆ ప్రహరీ గోడను చూపిస్తూ- "ఆ గోడ అవతల ఏముంది?" అని అడిగాడు.

కాపలావాడు కళ్లు పెద్దవి చేసి చూసి "ఏమీ లేదు" అన్నాడు.

"ఏమీ లేదూ?" అని గొణుక్కున్నాడు గాంధీ. "అవును. ఏమీ ఉండి ఉండదు. అదివేమో అది అంతా" అన్నాడు మళ్లీ.

వ్యానులో కోర్టుకు తీసుకుపోతూండగా అప్పలస్వామి అతన్ని నిశితంగా చూశాడు. అతని కణతల మీద నరాలు ఉబ్బి ఉన్నాయి. కళ్లు ఎర్రగా ఉన్నాయి. కళ్లజోడు తీసి జేబులో ఉంచుకుని మాటిమాటికీ కళ్లు నులుముకుంటూ కూర్చుని ఉన్నాడు. చూపులు ఎక్కడా నిలపడం లేదు.

కోర్టు హాల్లోకి పిలిచి బోనెక్కించగా ఉన్నట్టుండి పెద్దగా "నా రూములో ఫొటో ఉండాలి.... ఐన్‌స్టయిన్ ఫొటో... అది ముందు నాకిప్పించండి" అన్నాడు.

ఎవరూ పట్టించుకున్నట్టు కనిపించలేదు. కోపంతో కళ్లు ఎర్రబడ్డాయి. వొణుకుతున్న కంఠంలో మళ్లీ "దాన్ని తీసుకురండి... ఆపైన గోడకు తగిలిద్దాం... ఇక్కడ ఉండాలి అది... లేకపోతే నేనూరుకోను..." అన్నాడు.

న్యాయవాది వరుసగా ప్రశ్నలు వేశాడు. గాంధీ సమాధానాలు చెప్పకుండా నిలబడిపోయాడు. రెండు చేతులతో లాల్చీ గట్టిదనాన్ని పరీక్షించాడు. అది అంతలో ఫర్రున చినిగింది. అతడు తల ఎత్తి "చూశారా? ఇలా అనేసరికి చినిగిపోయింది..." అన్నాడు.

పోలీసు అధికారీ, పోలీసులూ, అప్పలస్వామి, న్యాయవాదులూ, వెనక కూర్చున్నవారూ, న్యాయమూర్తీ అందరూ కళ్లు పెద్దవి చేసుకుని చూస్తున్నారు- అంతలో గాంధీ "ఎంతసేపూ మీరడగడమూ, నేను చెప్పడమూ కుదరదు. నేను చెప్పవలసిందంతా నిన్ననే చెప్పాను... అవును... చచ్చిపోదామనుకున్నాను. ఇప్పుడు నేనడుగుతాను... తెలిస్తే చెప్పండి..." అని ఒక్క క్షణం ఆలోచించి- "ఆఁ! కాళ్లజెర్రి తెలుసుగా? దానికి అన్ని కాళ్లెందుకో చెప్పండి... చూద్దాం..." అన్నాడు. మళ్లీ "చెప్పలేరు... నాకు తెలుసు..." పోనీ "ఈ ఈజ్ ఈక్వల్ టు ఎంసీ స్క్వయిర్

అంటే ఏమిటి?" అని అడిగాడు. తర్వాత ఏమీ మాట్లాడకుండా ఉండిపోయాడు. అతని చూపులెక్కడో ఉన్నాయి.

న్యాయమూర్తి చివాలున లేచి లోపలికి వెళ్లిపోయాడు. అంతలో గాంధీ ముందు మెరుపు మెరిసినట్టయింది. ఎవరో కెమెరా "క్లిక్"మనిపించారు. గాంధీ పెద్దగా అరిచాడు... "ఎవర్రా అది... పట్టుకోండి..." తర్వాత పోలీసు అధికారి అతన్ని సమీపించి "రండి వెళదాం" అన్నాడు. గాంధీ వాక్ప్రవాహం ఆపి "ఎక్కడికి?" అని అడిగాడు.

"ఇంటికి పోదాం" అన్నాడాయన.

"నాకు ఇల్లు లేదు... వాకిలీ లేదు..." అన్నాడు గాంధీ.

"మీ ఇష్టం వచ్చిన చోటికి తీసుకుపోతాను. రండి" అన్నాడు ఆయన మళ్లీ.

"అయితే పదండి... రామలీలా మైదానంలో మీటింగు ఉంది. అక్కడ మాట్లాడుతాను ఇవ్వాళ... ఆ తర్వాత గేట్ వే ఆఫ్ ఇండియాకు పోదాం..."

"సరే... అక్కడికే పోదాం..." అన్నాడు పోలీసు అధికారి అతని చెయ్యి పట్టుకుని.

"రైతో... కానీ, అక్కడ ఫిరంగులూ అవీ ప్రేల్చగూడదని చెప్పండి... అవి నాకు గిట్టవు... అన్నట్టు నాకు కాయితాలూ, కలమూ కావాలి... ముందు అవి తెప్పించండి"

వ్యాను రోడ్డుమీద నడుస్తూ ఉండగా రోడ్డుమీద ఏదో ప్రజా ప్రదర్శన... అంతటా అలజడిగా, కోలాహలంగా ఉంది.

గాంధీ రహస్యం చెబుతున్నట్లు "అన్నట్టు మీకు రోజువారీ వాడకానికి ఆటంబాంబులు కావాలి కదా? ఎట్లా మేనేజ్ చేస్తున్నారు? మీక్కావాలంటే చెప్పండి... రెండు రోజుల్లో చేసి ఇస్తాను. కావలసిందల్లా కాయితాలూ... కలమూ అంతే..." అంటూ వెర్రినవ్వు నవ్వాడు.

అప్పలస్వామి పోలీసు అధికారిని నెమ్మదిగా ప్రశ్నించాడు. "సార్ ఏమిటి సంగతి?"

పోలీసు అధికారి కణతమీద బొటన వ్రేలుంచుకుని నవ్వి నెమ్మదిగా "మతి చెడింది... ఇక పిచ్చాసుపత్రే శరణ్యం" అన్నాడు.

జైలుకు వెళ్లగానే అతనికి కాసిని కాయితాలూ, కలమూ ఇచ్చారు. గాంధీ వాటిని ఆశగా, ఆదుర్దాగా అందుకుని చాపమీద కూలబడి వ్రాయడం ప్రారంభించాడు. అప్పలస్వామి దగ్గరగా నిలబడి చూశాడు. ఏవేవో వ్రాసి గాంధీ అయిదు నిముషాల తర్వాత అలిసిపోయాడు. తర్వాత కాస్సేపు ఆలోచించి ముందు ఒక సున్నా గీచాడు... అది తల... తర్వాత రెండు గీతలు గీచాడు... అవి చేతులు... మళ్లీ చాలా గీతలు- అవి తొడలు... కాళ్లు... తర్వాత వక్షస్థలాన్ని సూచిస్తూ రెండు పెద్ద సున్నాలు గీచాడు... అంతే... ఇక ఇతర వివరాలేవీ... కన్ను, ముక్కు వగైరాలేవీ లేవు. బొమ్మవేసి అప్పలస్వామి వంక చూసి నవ్వి "పేరు పెడతాను చూడు..." అంటూ కొద్ది క్షణాలు ఆలోచించి ఆ బొమ్మ క్రింద పెద్ద అక్షరాలతో "కాళ్లజెర్రి" అని వ్రాశాడు... తర్వాత నిద్ర వచ్చింది కాబోలు చాపమీద బోర్లా పడుకుని గురకపెడుతూ నిద్రపోయాడు.

❄